వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు వీరే


కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


మత్స్యరాస విశ్వేశ్వరరాజు


గొడ్డేటి మాధవి

సాక్షి, పాడేరు: జిల్లాలోని పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రస్తుత ఎంపీ గొడ్డేటి మాధవి నియమితులయ్యారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

న్యూస్‌రీల్

నేడు 'చాపరాయి' ప్రారంభం

డుంబ్రిగుడ: ఆధునికీకరించిన ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతాన్ని బుధవారం ప్రారంభించనున్నట్టు టీడబ్ల్యూ జేఈ అభిషేక్ తెలిపారు. సాయంత్రం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు.

వంజంగి హిల్స్‌పై పారిశుధ్య పనులు వేగవంతం


పారిశుధ్య పనులపై సమీక్షిస్తున్న డీఎల్పీవో కుమార్, ఎంపీడీవో సాయినవీన్

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతంగా విశ్వవ్యాప్తి పొందిన వంజంగి హిల్స్‌లో పారిశుధ్య పనులు ప్రారంభమయ్యాయి. గత రెండు నెలల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వంజంగి పరిసరాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ నెల రెండవ తేదీ నుంచి 9వ తేదీ వరకు వంజంగి హిల్స్ మూసివేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఉదయం నుంచి పర్యాటకుల రాక నిలిచిపోయింది. డీఎల్పీవో పీఎస్ కుమార్,ఎంపీడీవో సాయినవీన్ వంజంగి హిల్స్‌లో చేపట్టే పారిశుధ్య పనులపై సమీక్షించారు. తొలిరోజు లగిశపల్లి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. బుధవారం నుంచి వంజంగి హిల్స్‌లో పారిశుధ్య పనులు వేగవంతం చేస్తామని అధికారవర్గాలు వారు పేర్కొన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు


పట్టుబడిన గంజాయి,నిందితులతో పోలీసులు

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగుడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్ఐ బి.గోపాలరావు మంగళవారం తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కారు, బైక్‌లపై సీలేరు నుంచి విజయవాడకు గంజాయిని తరలిస్తూ కృష్ణాజిల్లాకు చెందిన. షేక్ సహిం, వంశీ కష్టారెడ్డి, గుంటూరు జిల్లాకు చెందిన చల్ల హరినాథ్‌రెడ్డి పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సారా బట్టీలపై దాడులు

- 1200 లీటర్ల బెల్లం పులుపు, 60 లీటర్ల సారా ధ్వంసం

కొయ్యూరు : అపరేషన్ పరివర్తన్‌లో భాగంగా మంగళవారం రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెం శివారులో సారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ ఆర్.ఎస్.కె బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారావు సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో 1,200 లీటర్ల బెల్లం పులుపును, 60 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని కూడా ధ్వంసం చేశామని ఎస్ఐ తెలిపారు. సారా తయారిదారులను గుర్తించి అరెస్టు చేస్తామన్నారు. రుసగా సారా బట్టీలపై దాడులు చేస్తున్నామని, కొద్దిరోజుల కిందట మర్రిపాం, బొంకులపాలెంలో కూడా దాడులు చేశామని తెలిపారు.

పింఛన్ల పండగ

పింఛను సొమ్ము పెంపుతో అవ్వాతాతలు, వితంతువుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈనెల నుంచి ప్రభుత్వం రూ.3 వేలు అందజేస్తుండటంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. నేరుగా వారికి పంపిణీ చేస్తుండటంతో తామంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,25,821 మందికి లబ్ధి చేకూరనుంది.

- రూ.3 వేలకు పెంపుతో అభాగ్యుల్లో ఆనందం
- జిల్లా వ్యాప్తంగా 1,25,821 మందికి లబ్ధి
- పాడేరు మండలంలో పంపిణీని ప్రారంభించిన అరకు ఎంపీ మాధవి
- జగనన్నకు రుణపడి ఉంటామన్న లబ్ధిదారులు


పెరిగిన పింఛను సొమ్మును అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, అరకు ఎంపీ మాధవి

పాడేరు : జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభం కావడంతో పండగ వాతావరణం నెలకొంది. పెంచిన సొమ్ముతో కలిపి రూ.3 వేలు అందిస్తుండటంతో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని, మళ్లీ ఆయనే సీఎం కావాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు.

ఎక్కువ మొత్తంలో ఇచ్చే ఏకైక రాష్ట్రం: అరకు ఎంపీ మాధవి

దేశంలో ఎక్కువ మందికి ఎక్కువ మొత్తంలో పింఛను సొమ్ము పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఇదొక చరిత్ర అని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛను సొమ్ము పంపిణీని మంగళవారం పాడేరు మండలానికి సంబంధించి ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సామాజిక పింఛన్లు అవ్వాతాతల ఆర్థిక అవసరాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో వారి కష్టాలను స్వయంగా చూశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచి ఇప్పటి వరకు పింఛన్లు పెంచుకుంటూ హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో 68 లక్షల మందికి ఇప్పటి వరకు పింఛను కోసం ఏటా రూ.24వేల కోట్లు చొప్పున కేటాయించారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ నెలకొల్పి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ సొమ్ము అందచడం చారిత్రాత్మకమన్నారు. పేదలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని ఆమె కోరారు.

గడపవద్దకే నేరుగా పథకాలు..

ఎన్నడూలేని విధంగా ఎంతో పారదర్శకంగా పింఛన్లు ఇస్తున్న ఏకైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు నెలకు.10వేల పింఛను ఇస్తున్న రాష్ట్రం కూడా మనదేనన్నారు. పక్క రాష్ట్రాల్లో పింఛన్, ఇతర పథకాల కోసం ప్రజలు రోడ్లపైకి వచ్చి క్యూ కడుతున్న సందర్భాలు ఉన్నాయని, ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. నేరుగా గడప వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. ఉద్యోగుల మాదిరిగానే ఏపీలో సామాజిక పింఛన్లు కూడా ఏటా పెంచుకుంటూ వచ్చారన్నారు. జనవరి ఒకటి నుంచి కొత్త పింఛన్ల పెంపు అమల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డీఎల్పీవో శాంతిలక్ష్మి, ఎంపీడీవో సాయినవీన్, ఈవోపీఆర్డీ రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పింఛన్‌దారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటా



వృద్ధాప్య పింఛను కోసం మూడు నెలల క్రితమే దరఖాస్తు చేశా.పరిశీలించిన అధికారులు మంజూరు చేశారు. మంజూరైన విషయం తెలియదు. అధికారులే పిలిచి మరి పింఛన్ మంజూరైన విషయాన్ని చెప్పారు. ఇంత తొందరగా పింఛన్ మంజూరవుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– కూడా రాంబాబు, వృద్ధాప్య పింఛనుదారు, వంతాడపల్లి, పాడేరు మండలం

రూ.3 వేలతో ఆసరా



గతంలో వితంతు పింఛను రూ.వెయ్యి మాత్రమే వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రూ.2,250 పింఛనుసొమ్ము అందింది. ఇప్పుడు రూ.3వేలు పింఛన్ సొమ్ము తీసుకోవడం ఆనందంగా ఉంది. భర్త లేని నాకు ఈ పింఛన్ సొమ్ము ఎంతో ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తున్నారు.

– కిల్లో పార్వతమ్మ, వితంతు పింఛనుదారు, పాడేరు

టీడీపీ ప్రభుత్వంలో కాళ్లరిగేలా..



గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేశా. రెండేళ్లు కాళ్లరిగేలా తిరిగినా మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ దరఖాస్తు చేశా. వెంటనే పింఛన్ మంజూరు చేశారు. నాలుగున్నరేళ్లుగా పింఛన్ సొమ్ము నేరుగా గడప వద్దకే అందుతోంది. జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎ.సర్వయ్య, పింఛనుదారు. లోచలిపుట్టు, పాడేరు మండలం

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

- రాష్ట్ర ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం జాయింట్ డైరెక్టర్ జనార్దన్
- 324 మందికి ఉచిత వైద్య పరీక్షలు
- ఆరుగురికి ఉన్నత వైద్యానికి రిఫర్


రోగులకు మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అడ్డతీగల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు అని ఫ్యామిలి ప్లానింగ్ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమంలో భాగంగా అడ్డతీగలలో గ్రామసచివాలయం –2లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి వరమన్నారు. పేదల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తోందన్నారు. ఈ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 324 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఉన్నత వైద్యం కోసం ఆరుగురిని రిఫర్ చేశారు. పీడియాట్రీషియన్ పి.సత్యనారాయణరాజు, అసిస్టెంట్ సివిల్ సర్జన్ వై.దేవి ప్రియాంక, ఆప్తాల్మిక్ ఆఫీసర్ పి.వెంకటరావు, అనస్తీషియన్ బి.రచన, ఎంపీడీవో కె.బాపన్నదొర గ్రామసచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం జాయింట్ డైరెక్టర్ జనార్దన్

శిబిరంలో సత్వర వైద్యం



ఒంటిలో నలతగా ఉంది.వైద్య శిబిరం ఉందని తెలుసుకుని వెళ్లా. వెంటనే వైద్య పరీక్షలు చేశారు. బీపీ ఎక్కువగా ఉందని చెప్పారు. ఉచితంగా మందులు ఇచ్చారు. వాటిని వేసుకున్న వెంటనే అదుపులోకి వచ్చింది.

– జల్లి చిన్నాలమ్మ, సీతారామరాజు కాలనీ, అడ్డతీగల

ఉచితంగా మందులిచ్చారు



ఆరోగ్యం బాగులేనప్పుడల్లా అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి వెళ్లావాళ్లం. గ్రామంలో నిర్వహించిన శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షల జరిపారు. స్వల్పంగా జ్వరంతో ఉండటంతో ఉచితంగా మందులు ఇచ్చారు.

– మిర్తివాడ సోమాలమ్మ, వాల్మీకి వీధి, అడ్డతీగల

'తారుమారు'కు సంక్రాంతి శోభ


'జోరా' అంటూ వంగి నమస్కరించుకుంటున్న గిరిజనులు

మండల కేంద్రమైన జి.మాడుగులలో మంగళవారం నిర్వహించిన తారుమారు సంతకు గిరిజన తండాల నుంచి భారీగా తరలివచ్చారు. తీసుకువచ్చిన అటవీ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించి పండగకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. రాబోయే సంక్రాంతి పండగకు ఒకరినొకరు ఆహ్వానించుకున్నారు. సంతకు వచ్చిన నేస్తపు చుట్టాలను వంగి 'జోరా' అంటూ నమస్కరించుకున్నారు. యువకులు ఆప్యాయంగా పలకరించుకుని పండగకు పిలుచుకున్నారు.

8లో

సమ్మె విరమించాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ విజ్ఞప్తి

సాక్షి,పాడేరు: గ్రామాల్లో గర్భిణుల, మాతాశిశువుల ఆరోగ్యం,పౌష్టికాహార ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు,హెల్పర్లు సమ్మెను విరమించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అంగనాడీ సిబ్బంది సమ్మెతో ప్రభుత్వ పెద్దలు, ఇతర అధికార యంత్రాంగం అనేక దఫాలుగా జరిపిన చర్చల ద్వారా కొన్ని డిమాండ్లను అంగీకరించిందన్నారు.అలాగే ప్రభుత్వం పలు జీవోలు కూడా జారీ చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు, పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులను విడుదల చేసిందన్నారు.అంగన్‌వాడీ కార్యకర్తలు,హెల్పర్లకు టీఏ, డీఏ క్లెయిమ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు. హెల్పర్లకు అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతికి వయో పరిమితి 50ఏళ్లకు పెంచడంతో పాటు,వర్కర్లు,హెల్పర్లకు రిటైర్‌మెంట్ వయసు 62ఏళ్లుగా నిర్ణయించిందన్నారు.సేవా ముగింపు ప్రయోజనం కింద వర్కర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.40వేలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.ఈనెల ఐదవ తేదీలోగా అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, లేకుంటే ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

కలుషిత ఆహారంతో విద్యార్థినులకు అస్వస్థత

- వెంటనే 25 మందిని ఆస్పత్రికి తరలింపు
- బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన



ఏడుగురాళ్లపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

చింతూరు: మండలంలోని బొడ్డుగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని హుటాహుటిన సమీపంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థినులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. సిబ్బంది మొదటగా 12 మందిని, రాత్రి మరో 13 మందిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వెంటనే అత్యవసర చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య వెంటనే పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అస్వస్థతకు గల కారణాలు తెలుసుకుని విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి హుటాహుటిన ఏడుగురాళ్లపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థినులకు సత్వర వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం విద్యార్థినులంతా కోలుకుంటున్నారని, ముగ్గురు విద్యార్థినులను మెరుగైన చికిత్స నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. కాగా ఆశ్రమ పాఠశాల డార్మెటరీ, వంటగది అపరిశుభ్రతే ఆహారం కలుషితం కావడానికి కారణంగా వైద్యులు చెబుతున్నారు.



క్లుప్తంగా

దీక్షలు విరమించి విధుల్లో చేరండి

- అంగన్‌వాడీలకు సర్క్యులర్ అందజేసిన సీడీపీవో సువర్ణమ్మ


అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సర్క్యులర్‌ను అందజేస్తున్న సీడీపీవో సువర్ణమ్మ

జి.మాడుగుల: అంగన్‌వాడీ కార్యకర్తలు వెంటనే దీక్షలు విరమించి విధుల్లో చేరాలని సీడీపీవో సువర్ణమ్మ కోరారు. మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు పక్కన నిర్వహిస్తున్న అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆమె సందర్శించి, యూనియన్ నాయకులకు సర్క్యులర్‌ను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లలో చాలా వాటికి ప్రభుత్వం అంగీకరించి, తదనుగుణంగా జీవోలను జారీ చేసినట్టు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ హెల్పర్లకు అంగన్‌వాడీ వర్కర్లుగా పదోన్నతి కల్పించేందుకు అంగీకరించిందని, వయోపరిమితి 45సంవత్సరాలు నుంచి 50సంవత్సరాలు పెంచుతూ గత నెల 20న జీవో జారీ చేసినట్టు తెలిపారు. టీఏ, డీఏల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. గర్భిణులు, పిల్లల ఆరోగ్యం, పోషణ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించి, ఈ నెల 5లోగా విధులకు హాజరుకావాలని లేని పక్షంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

నేటి నుంచి చిన్నారులకు ప్రత్యేక యోగా శిబిరం



ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో జనవరి 3 నుంచి జనవరి 12వ తేదీ వరకు చిన్నారుల కోసం సాధారణ యోగా, స్థూలకాయ నివారణకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. 8 నుంచి 14 మధ్య వయసున్న చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922, 99854 56150 సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు చిన్నారుల యోగ తరగతులు జరుగుతాయన్నారు.

'తారుమారు'కు సంక్రాంతి శోభ

- గిరిజన సంప్రదాయానికి అద్దం పట్టిన సంత
- జోరుగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు
- భారీగా పండగ సామగ్రి కొనుగోలు
- రూ.2 కోట్ల మేర లావాదేవీలు
- పండగకు ఒకరికొకరు ఆహ్వానం

జి.మాడుగుల: మండల కేంద్రంలోని వెంకటరాజ్ ఘాట్ వద్ద మంగళవారం నిర్వహించిన తారుమారు (పండగ) సంత గిరిజన సంప్రదాయానికి అద్దం పట్టింది. ఏటా జనవరి నెలలో జరిగే సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకొని జి.మాడుగులలో ఈ సంతను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏర్పాట్లను సర్పంచ్ కిముడు రాంబాబు, మత్స్యరాస నాగరాజు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు..

తారుమారు సంతలో దుస్తులు, నిత్యావసర దుకాణాలను అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన రైతులు రాజ్‌మా చిక్కుళ్లు, పసుపు, అల్లం, పిప్పలి, అడ్డాకులు, కొండచీపుర్లు, నాగలి దుంపలు, కూరగాయలు విక్రయించారు. నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు, పశువుల అమ్మకాలు జరిగాయి. సుమారు రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్టు అంచనా. గిరిజన తండాల నుంచి పండగ సంతకు భారీగా తరలివచ్చారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించగా వచ్చిన సొమ్ముతో సంక్రాంతి పండగకు అవసరమైన దుస్తులు, నిత్యావసర సరకులు కొనుగోలు చేశారు.

- వారపుసంతకు తరలివచ్చిన గిరిజనులు తమ బంధువులు, స్నేహితులకు తమతో తీసుకొచ్చిన యుక్త వయసు పిల్లలను ఒకరినొకరు పరిచయాలు చేసుకొని బంధుత్వాలపై మాట్లాడుకున్నారు.
- సంతలో జీలుగకల్లు, మడ్డికల్లు వంటి మత్తు పానీయాలు విక్రయించే చోటుకు చేరి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు విందులు ఏర్పాటుచేసుకున్నారు.
- బంధుత్వాలు కుదుర్చుకున్న కుటుంబాలు సంక్రాంతి పండుగకు ఒకరినొకరు ఆహ్వానించుకున్నారు.
- సంతకు వచ్చిన నేస్తవు (వరసకు అన్నదమ్ములు) చుట్టాలు ఎదురుపడినప్పుడు మర్యాదపూర్వకంగా వంగి 'జోరా'అంటూ నమస్కరించుకున్నారు. యువకులు ఆలింగనం, కరచలనంతో అప్యాయతగా పలకరించుకొని పండుగకు ఆహ్వానించుకున్నారు.


సంతలో విక్రయిస్తున్న వంటపాత్రలు


సంతలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల దుకాణాలు


సంక్రాంతికి అవసరమైన కొత్త కుండలను కొనుగోలు చేస్తున్న మహిళలు


విక్రయించేందుకు తీసుకువచ్చిన డప్పు వాయిద్యాలు

భారీగా కుండల కొనుగోళ్లు

సంక్రాంతి పండగ సందర్భంగా పితృ దేవతలకు పులగాం తయారుచేసి సమర్పించేందుకు కుండలు కొనుగోలు చేశారు. ధరలు కూడా భారీగా పెంచేశారు. ఒక్కో పిడిత, కుండకు రూ.70 నుంచి 100 ధర పలికింది.

వాహనాల దారి మళ్లింపు

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. వాహనాలు దారి మళ్లించారు. స్థానిక సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీనివాస్ వాహనాల ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సమర్థంగా అభివృద్ధి, సంక్షేమం అమలు


గిరిజనుల వినతులను పరిశీలిస్తున్న పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్

- పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశం
- మారుమూల గ్రామాల్లో పర్యటన


గిరిజనుల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్, ఏఎస్పీలు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గిరిజన గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. ఇటీవలే పాడేరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె తన భర్త చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి మంగళవారం మండలంలోని మారుమూల గ్రామాలైన కొత్తపాలెం, కొమ్మసంపంగి, కొయ్యూరు మండలం మండపల్లిలో పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు గిరిజనులు వారి సమస్యలను వీరిద్దరి దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ బియ్యం తీసుకునేందుకు రెండు రోజులపాటు 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మోసుకుని తీసుకు రావాల్సి వస్తోందని మండపల్లి గిరిజనులు వాపోయారు. బియ్యం పంపిణీ వాహనాన్ని పందిరాయి కొత్తగూడెం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. ఆధార్, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు, విద్యార్థులకు పాఠశాలల్లో అడ్మిషన్లు తదితర అంశాలపై వినతులు ఇచ్చారు. వీటిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, రెవెన్యూ అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. చదువుకుని గ్రామాల్లో ఖాళీగా ఉంటున్న గిరిజన యువత చెడు మార్గాలవైపు వెళ్లవద్దని క్రీడలు, స్వయం ఉపాధి వంటి మార్గాలను ఎంచుకోవాలని ఏఎస్పీ సూచించారు.ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు, సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి, ఆర్‌ఐ మహదేవ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


హాజరైన పాడేరు-అరకు నియోజకవర్గాల అధికారులు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: రానున్న ఎన్నికల ప్రక్రియలో జోనల్ అధికారులంతా విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో మంగళవారం సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కొంతమంది అధికారులు ఆలస్యంగా రావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు,పోలింగ్ కేంద్రాలు,ఎన్నికల సిబ్బంది విధులపై అధికారులంతా అవగాహన పొందాలని సూచించారు. పోలింగ్ అధికారులు,సిబ్బంది అంతా కేటాయించిన బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మార్గంమధ్యలో ఎక్కడ వాహనాలను నిలపకూడదన్నారు. మాక్ పోలింగ్‌పై అవగాహన పొందాలని, ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రిసైడింగ్ అధికారులు డైరీని సక్రమంగా నిర్వహించి, ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు.

రానున్న 20రోజుల పాటు జోనల్ అధికారులంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని, రవాణాకు అనుకూలంగా ఉన్న రోడ్లు, ఇతర సౌకర్యాలపై సమీక్షించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై తమకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ జోనల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సమయంలో అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, పోలీసు అధికారులతో గత అనుభవాలపై చర్చించాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై తమకు నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో వి.వి.రమణ, ఎస్‌డీసీ అంబేద్కర్, పాడేరు, అరకు నియోజకవర్గాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్(విశాఖ) : బీఈ, బీటెక్ డిగ్రీ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపికృష్ణ శివ్వం, ఆంధ్రప్రదేశ్ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, భారత ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా సీడాప్ దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంలో 21నుంచి 27 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. బీఈ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్ (30 సీట్లు), మెకట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టం ఇంటిగ్రేటర్ ఇంజినీర్(30 సీట్లు) కోర్సుల్లో 3 నుంచి 5 నెలలపాటు ఉచిత భోజనం వసతి కల్పించి, ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 85006 87750 నంబరులో సంప్రదించవచ్చు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ప్రైవేట్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Further Studies and Abroad. Ph : 83417 74299 [V- 796966]

■ One Sitting, 10th, Inter, Degree, B.Tech., (All Groups) Diploma, I.T.I., భీమవరం, కాంటాక్ట్ : 96669 63197, 96425 75794. [P-772864]

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL :73383 76874 [R-221]

Real Estate

FLAT FOR SALE

■ Chinamushidiwada Near BRTS Road, VUDA E/Facing 4 B/R Car Parking Duplex House 71 Sqyds Direct Party Only. Ph : 98660 54305 [V- 2329]

PLOT FOR SALE

■ విశాఖపట్నం ఆర్థిక రాజధానిలో VMRDA Approved Plots for Sale 200 feet Road Facing Atchutapuram Yelamanchili Road Facingలో కమర్షియల్ Plots for Sale 1275 Sqyds 200 Feet Road Facing. 86397 65271 [V-2328]

■ కమర్షియల్ Plots ఫర్ సేల్ : అనకాపల్లి జిల్లాలో హైవే ఫేసింగ్ నాగార్జున సిమెంట్ ఎదురుగా తాళ్ళపాలెం VMRDA అప్రూవల్‌తో అతి తక్కువ ధరకు. ఫోన్ : 90003 52156 [V-797107]

■ న్యూ ఇయర్ ఆఫర్ Reg ఫ్రీ. GVMC పరిధిలో 5 లక్షలకే 111 గజాలు ఇల్లు కట్టుకొనేలా 150 బిట్లు, EMI కలదు. ఫోన్ : 80196 24319 [V-796965]

■ మన ఉత్తరాంధ్రలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు & నేషనల్ హైవేకి అతి చేరువలో ఊరుని ఆనుకొని ఇళ్ళస్థలాలు గజం కేవలం రూ. 4499/-కే అమ్మకం. సంప్ర|| ఫోన్: 94926 78668. [V- 1897]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11342]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అప్పయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం|| వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [V- 797105]

SEPTIC TANK CLEAN

■ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఐరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా అతి తక్కువ ఖర్చుతో 5 ని||ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 27171 [V-2332]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర|| 9177736926. [M-1167580]

■ ప్రముఖ బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు 30 సంవత్సరాల లోపు గల ఫీమేల్ హెల్పర్స్ కావలెను. Qfl : Inter, Salary : 18,000/-, అనుభవం అవసరం లేదు. ఫోన్: 76720 38239 [V-797108]

■ Wanted Teachers : Higher Classes : Physical Science. Springdalls High School, Gajuwaka. Cont : 98481 99867 [V-797095]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797097]

■ Wanted Female Computer Operator, any Degree GREEN LIFE PHARMA. Cont : 96189 84239, 88978 57239 [V-2303]

■ మేనేజర్స్ (M/F) కావలెను. అర్హత : MBA, MCA & Degree. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఫోన్ : 99491 29054, 93474 73257 [V-1909]

■ సువర్ణభూమి సంస్థలో పార్ట్ టైం / ఫుల్ టైం పనిచేయుటకు హౌస్ వైఫ్స్ రిటైర్డ్ పర్సన్స్ కావలెను. మంచి ఇన్సెంటివ్ + కమీషన్ కలదు. కోటీశ్వరులు అవ్వాలనుకునే వారికి మంచి అవకాశం. ఫోన్ : 96662 82005 [V-11497]

■ రెడీమేడ్‌షాపులో పనిచేయుటకు సేల్స్ స్టాఫ్ కావలెను. లేడీస్‌కు జీ : 9,000/- + కమీషన్ + 4 రోజులు = 11,000/-. జెంట్స్ జీ : 10,000/- + కమీషన్ + 4 రోజులు = 12,000/-. పవన్ షోరూమ్, 5th లైన్, ద్వారకానగర్, వైజాగ్-16. ఫోన్ : 94408 02452, 94406 02456 [V-1355]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోనే మీ ప్రకటనలను సంప్రదించండి

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

చిరు వ్యాపారులకు గొడుగులు

- నీడ కల్పించడమే లక్ష్యం
- ఒక్కొక్కటి రూ.1200 ధరతో రెండు వేలు కొనుగోలు
- పంపిణీకి అరకు ఎంపీ మాధవి శ్రీకారం

సాక్షి,పాడేరు : రోడ్డు పక్కన చిరువ్యాపారులకు నీడ కల్పించడమే లక్ష్యంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పెద్ద సైజు గొడుగుల పంపిణీకి చర్యలు చేపట్టారు. అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారులను గుర్తించిన ఆమె వారికి గొడుగులను అందుబాటులోకి తెస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, ఇతర ప్రభుత్వ పథకాలు ఈగొడుగుపై పొందుపరిచి ఆకర్షణీయంగా ఆమె డిజైన్ చేయించారు. ఒకొక్కటి రూ.1200 ధరతో రెండు వేల గొడుగులను ఎంపీ మాధవి సొంత నిధులతో కొనుగోలు చేశారు. వీటిని ఇటీవల వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి విశాఖలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేయగా పాడేరు,అరకులోయ ప్రాంతాల్లో పంపిణీకి ఎంపీ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఆమె భర్త,నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శివప్రసాద్ మంగళవారం సాయంత్రం పాడేరు పాతబస్టాండ్‌లోని చిరువ్యాపారి వృద్ధురాలు చిలకమ్మకు అందజేసి పంపిణీ ప్రారంభించారు.


పాడేరులో చిరు వ్యాపారి చిలకమ్మకు గొడుగును అందజేస్తున్న ఎంపీ భర్త శివప్రసాద్

క్రీడాకారులకు అండగా ఉంటాం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. గతనెల 23,24 తేదీల్లో కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన ఫ్రీస్టైల్, కుస్తీ పోటీలు అండర్-15 విభాగంలో రంపచోడవరం ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు కావాల్సిన మెటీరియల్‌ను సమకూరుస్తామని, ఇప్పటికే దుస్తులు, షూలు ఆర్డర్ చేసినట్లు పీవో తెలిపారు. జిమ్, విలువిద్యకు కావాల్సిన మెటీరియల్‌కు కూడా త్వరలోనే ఆర్డర్ చేస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకోవడంతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆయన సూచించారు. పిఠాపురంలో జరిగిన పోటీల్లో మౌనికాహర్షిణి బంగారు పతకం, ఉమామహేశ్వరి, ఐశ్వర్య, వినోద్‌కుమార్‌రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో పీడీ పోతురాజు, పీఈటీ అబ్బాయిరెడ్డి, రెజ్లింగ్ కోచ్ రత్నరాజు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

నేటి నుంచి 'పోలవరం' గ్రామసభలు


చింతూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇంటిపన్ను చెల్లిస్తున్న ఇళ్ల యజమానులు

చింతూరు: అవార్డు ఎంక్వయిరీలో భాగంగా చింతూరులో మూడురోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్ బాబు మంగళవారం తెలిపారు. క్లస్టర్ల వారీగా బుధవారం నుంచి శుక్రవారం వరకు ఈ గ్రామసభలు జరుగుతాయని ఆయన చెప్పారు. బుధవారం 4,5,6,12,14,15,21 క్లస్టర్లకు సంబంధించి స్థానిక ఎస్టీ కాలనీలోని సాపిడ్ సంస్థ వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. గురువారం 7,8,9,10,11,13 క్లస్టర్లకు సంబంధించి స్థానిక బీసీ కాలనీలో చర్చి వద్ద, శుక్రవారం 1,2,3,16,17,18,19,20 క్లస్టర్లకు సంబంధించి స్థానిక సంతమార్కెట్ ఆవరణలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎస్డీసీ చెప్పారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న కట్టడాలకు సంబంధించి నిరూపణ నిమిత్తం సంబంధిత యజమానుల నుంచి ధ్రువీకరణపత్రాలు తీసుకోనున్నట్టు తెలిపారు. యజమానికి సంబంధించిన ఇంటిపన్ను రసీదు, ఆధార్‌కార్డు, ఓటరుకార్డు, రేషన్‌కార్డు, కరెంటుబిల్లు జెరాక్స్‌లతో పాటు బ్యాంకుఖాతా కలర్ జెరాక్సు, మూడు చిన్నసైజు ఫొటోలు గ్రామసభలో అధికారులకు అందజేయాలన్నారు. మూడురోజుల పాటు చింతూరులో నిర్వహించే గ్రామసభలకు సంబంధించి మూడు ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు తెలిపారు. గ్రామసభలో ఇంటిపన్ను రసీదులు సమర్పించాలని అధికారులు తెలపడంతో ఇంటి యజమానులంతా తాము బకాయిపడిన పన్నులు చెల్లించి రసీదులు పొందేందుకు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని క్యూ కడుతున్నారు.



అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.
a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.
b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.
c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్ల కొనసాగింపుకు గరిష్ఠ వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.
d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్లు విడుదల చేయబడ్డాయి.
2. అంతేకాకుండా 2019 నుండి
a) అంగన్‌వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్‌వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.
b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.
c) అదే సందర్భంలో ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.
d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.
e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింపచేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.
f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.
3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.
4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు చేరు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలకు ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.
5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.
6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.
7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు ఐఫ్ఫ్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6% 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూపులో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలియియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమించవెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

సం/-
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, అల్లూరి సీతారామరాజు జిల్లా.